# సాయి దర్శన్

## 108 పుష్పాలమాల

## 3వ పుష్పము

3. ఓం శ్రీ సాయి - సత్య ధర్మపరాయణాయ నమః

1) నామ పారాయణ ప్రియుడు :

సత్యే యథాభూతార్థకథనే ధర్మేచ బోధనా లక్షణే ప్రకర్షేణ నియత ఇతి "సత్యధర్మపరాయణః" (శ్రీ శంకరులు) సత్యము పలుకుట యందును, ధర్మమును తెలుపుట యందును నిలకడగా నుండువాడు సత్యధర్మపరాయణుడు. "సత్యధర్మజ్ఞానాదయో స్యేతి సత్యధర్మా" (శ్రీ శంకరులు) = సత్యములైన ధర్మము, జ్ఞానము మొదలగు గుణములు గలవాడు సత్యధర్ముడు. పరాయణుడు = ఆచంచల దీక్షగలవాడు. "సత్యంవద ధర్మంచర" (తై.ఉ.) = సత్యమును పల్కుము.ధర్మమును ఆచరించుము. స్వామి సత్యధర్మములు పలుకుట యందును, ఆచరించుట యందును, జ్ఞానము మొదలగు సుగుణముల యందును. అచంచల దీక్షగలవాడు. ఇవి ఎక్కడ వుండునో అచ్చట భయము, అశాంతి యుండజాలవు. అట్టి స్వామికి నమస్కారము చేయుచున్నాను.

2) కవీశ్వరుడు

పెద్దలు దురాశ దుఃఖం చేటు అన్నారు. "ఆశాపాశమునకు అంతులేదు" అన్నది భారతము. "కాలః క్రీడతి గచ్ఛత్యా యుస్త దీపిన ముఞ్చత్యాశావాయుః" (శ్రీ శంకరులు) = కాల చక్రము పరిభ్రమించుచున్నది. ఆయువు గతించుచున్నది. కాని ఆశావాయు మోక్షమార్గా వరోధకంబు అగు తృష్ణ యను పెనుగాలి చుట్టుకొని యున్నదన్నారు.

అట్లే స్వామి దివ్యవాణి:

గాలియందున జ్యోతి కదలుచుండు
గాలి లేని జ్యోతి కదలకుండు
గాలివంటి ఆశ కట్టివేసినయంత
నిశ్చలంబైన మనసు నిలచియుండు ॥

అన్నది. చలించని మనస్సే మోక్షము. చలించు మనస్సు సంసారము అన్నది వేదాంతము. ఆశ లేకుండా వుంటే మనసు గాలిలేని దీపము వలె నిశ్చలంగా వుంటుంది, అదే ముక్తి.

3) సకలతత్త్వ బోధకుడు

పిలుపు - పలుకు

స్వామి తల్లి ఈశ్వరాంబ ధన్యురాలు. సాయి పరమేశ్వరుని కన్న మహాతల్లి. పరమేశ్వరుడే తల్లి గర్భాన్ని ఎన్నుకున్నాడు. జనన సమయమందు అనేక శుభ లక్షణాలు కనిపించాయి. తంబురులు మ్రోగాయి. వీణా వాద్యము వినిపించింది. పెద్దలను సంప్రదిస్తే అవి పరమ మంగళప్రదమైన లక్షణాలు అన్నారు. నవంబరు 23, 1926 కార్తీకమాసము సోమ వారము ఉదయం భగవానుడు భగవానుడు అవతరించాడు. ఈశ్వరాంబ అంత్యదశ వచ్చింది మే 6వ తారీఖు. స్వామి ఆరోజును "పిలుపు-పలుకు" అని దివ్యబోధ చేశారు. ఆ రోజు ఈశ్వరాంబ డే అని పేరు పెట్టారు. పిల్లలకు ఆదర్శము అందించిన రోజు. ప్రతి వ్యక్తికి మృత్యువు తప్పనది కాదు. ఆ మృత్యువు సమయంలో పవిత్రమైన దైవత్వమును స్మరించడం మన లక్ష్యం. "మంచి వారికి మరణము సాక్షి" అని చెప్తూ వుంటారు. భక్తియనేది మరణ సమయంలోనే తెలుస్తుంది. బెంగుళూరులో వేసంగి క్లాసులు జరుగుతున్నాయి. నగర సంకీర్తన 6 గం॥లకు, పిల్లలకు టిఫిను 9 గం॥ల

కు ముగిసాయి. అందరికీ దర్శనమిచ్చాను. స్నానానికి పోయాను. ఈశ్వరమ్మ స్నానము చేసి, కాఫీ త్రాగి వరండాలో కూర్చు న్నది. "స్వామీ, స్వామీ, స్వామీ" అని మూడుసార్లు అన్నది. "వస్తున్నాను, వస్తున్నాను" అన్నాను. ఇంతలో ప్రాణం విడిచింది.

స్వామి అని స్మరణ మంచివారికే వస్తుంది. కేవలము గజరాజు పిలుస్తునట్లుంది. క్షణాలలో అంతా అయిపోయింది. ఇదే జీవితమునకు నిజమైన అంతరార్థము. ప్రక్కన వెంకమ్మ, శైలజ మనుమరాలు ఉన్నారు. స్వామినే స్మరించి పిలిచింది. ఆ భావము, అంత్యదశలో సహజంగా రావడం, ఈశ్వరమ్మ జీవితము ఆదర్శవంతమైనదని తెలుస్తుంది.

4) జ్ఞానస్వరూపుడు

అంత్యదశ దైవభావనను గురించి భగవద్గీతలో

శ్లో॥ ఏషః బ్రాహ్మీస్థితిః పార్థ । నైనాం ప్రాప్య విముహ్యతి ।
స్థిత్వా సామంతకాలే । బ్రహ్మనిర్వాణ మృచ్ఛతి ॥ (2-72)

తా॥ ఓ కుంతీపుత్రుడా! బ్రహ్మజ్ఞాననిష్ఠ యనునది చెప్పబడినదై యున్నది. ఈ బ్రహ్మజ్ఞాన నిష్ఠ పొందిన పిదప సంసార మోహమును పొందుట లేదు. ఆ బ్రహ్మజ్ఞాన నిష్ఠలో మరణకాలము నందుండినను, బ్రహ్మముతో లయము పొందుచున్నాడు. "ఇంతవరకు చెప్పినది బ్రహ్మమును గూర్చిన స్థితి. బ్రహ్మ స్వరూపముగనే యుండుట అనునది "ఓ పార్థా! ఈస్థితిని బడసిన వాడెవ్వడును మోహము పొందడు. బ్రహ్మము నాశ్రయించిన ఈ స్థితిలో ఒకడు కడపటి దశ యందుండినను, బ్రహ్మానందమును, మోక్షమును పొందుచున్నాడు. ఎవడు బ్రహ్మచర్యమునందుండియే, సన్న్యాసము పొంది, జన్మమంతయు బ్రహ్మము నందే నిలబడునో, అతడు బ్రహ్మానందమును బడయుటను పేరు చెప్పవలెనా?" (శ్రీ శంకరులు).ఇదియుగాక అజామీళుడు క్రూరాత్ముడు. తన అంత్యదశలో "నారాయణ, నారాయణ" అని తన కుమారుని పిలిచాడు. అతనికి మోక్షము వచ్చింది.

క్రూరాత్ముడజామీళుడు నారాయణాయని ఆత్మనందుని పిలువ ।
ఏరీతి నేలుకొంటివి ఏరీ నీ సాటివేల్పు రెండున కృష్ణా ॥ (కృష్ణ శతకము)

బ్రహ్మ ప్రాప్తి లేనివానికి, అంత్యదశలో "నార" చూపిస్తే 'పీచు' అంటాడు. నారాయణ అనుదానిలో సగమైన "నారా"యని కూడా అనడు. అందుచే, హఠాత్తుగా బ్రహ్మప్రాప్తి సంభవింపదు. పూర్వజన్మ సుకృతముచే భగవంతుని అనుగ్రహము ఈ జన్మలో గలిగిన అంత్యదశలో వాని భావనలన్నీ పరమాత్మ మీదనే యుంటాయి. ఈశ్వరమ్మ పరమాత్మనే గన్న మహాతల్లి.

5) ప్రేమ స్వరూపుడు

రూపము వేరు, స్వరూపము వేరు. రూపము మన మామూలు ఆకారమును తెలియజేస్తుంది. ఆకారమనగా ఎత్తు, పొట్టి మొదలగునవి. రూపమనగా నలుపు, ఎరుపు మొదలగునవి. స్వరూపమనగా అఖండాకారమై మార్పులేక, ఒక్క విధముగనే ఎల్లప్పుడు నుండుట. ఆకారము, రూపము మార్పుచెందునవి. స్వరూపము మారనిది. అట్టి స్వరూపము నిర్మలత్వము, సూక్ష్మము, జ్ఞానము, ఆనందము మొదలగునవి. దానినే అఖండైకరసమందురు. స్వామి, ప్రేమయే స్వరూపముగా గలవాడు. "సః వైరసః" అన్నది వేదాంతం. అటువంటి స్వామి అంటారు. "నేను భక్తుని దగ్గరకు వెళ్ళలేదంటే అది నాలోపము గాదు. భక్తుని హృదయము ప్రేమ పూరితము కాలేదన్న మాట. హృదయ స్వచ్ఛత చేసుకోండి. అందరికీ మంచిగా వుండండి. దయగా వుండండి. ఇతరుల తప్పులు ఎన్నవద్దు. ఎవ్వరైనా తప్పులు చేస్తే మంచి మాటల వలన మార్చండి.మీ యింట్లో పనివారిని కరుణతో చూడండి. గౌరవంగా మాట్లాడండి. ఇతరుల ఎడ, అసూయ ద్వేషము వద్దు. తప్పులకు పశ్చాతాప పడండి. నీ వాగ్దానాలు, సరిగా యుండేటట్టు శక్తి యిమ్మని భగవంతుని ప్రార్థించండి."

దివ్యలీల : ఆ ప్రేమ స్వరూపుడే సృష్టికర్త. ఒకసారి అవమాలను సృష్టించి, భక్తుడు కిలారు కలెక్టరు నాయరుకు ప్రసాదించినారు. ఒక వుంగరాన్ని సృష్టించి శ్రీమతి సీతామహాలక్ష్మి భర్తయైన శ్రీ సాంబశివరావునకు స్వయముగా వ్రేలికి తొడిగి అతని వ్యాధికి (అల్పాచమానంలో రక్తము) దివ్యచికిత్స చేసిరి.

6) సకలజన ప్రియుడు

శ్రీ భువనస్వామి తన అనుభూతిని యిట్లా చెప్పారు - "నేను బృందావనం సత్యసాయి కాలేజీలో చేరేటప్పటికి మతాన్ని గురించి గాని, జీవితాన్ని గురించి గాని, నాకు ఏమీ తెలియదు. కాని ఈ కాలేజి భగవంతుడు స్థాపించాడని అందుచేతనాకు ఉపయోగిస్తుందని మాత్రమే తెలుసు". అది అనిర్వచనీయమైన నమ్మకము. దేశంలో చాలామంది విద్యార్థులు పాశ్చాత్య ప్రభావమునకు లోనైయున్నారు. కాని యిచ్చట ఉపాధ్యాయులు నిస్వార్థ ప్రేమతో చదువులు చెప్తుతున్నారు. మానవతా విలువలు బోధిస్తున్నారు. ఇదంతా భగవానుని అపార ప్రేమవలన జరుగుతోంది. భగవానుని ప్రేమ దృష్టి ఒక్కసారి పడెనా, ఎటువంటి విద్యార్థియైనా మారిపోతాడు. ఈ విద్యా సంస్థ ఆధ్యాత్మిక వాతవరణంతో నిండి యున్నది. మొదట్లో యిట్టి పద్ధతులకు, కొంచెం కష్టంగానే యుంటుంది. తరువాత అలవాటు పడిపోతారు. ఇంటిమీద బెంగ యుండదు.కొంతకాలమయ్యేసరికి విద్యార్థులు మణిపూసలు లాగా తయారవుతారు. "మానవ సేవయే - మాధవ సేవ" యని నిరూపిస్తారు.

7) స్తుతి ప్రియుడు

స్వామి భజనకే ప్రాముఖ్యత యిస్తారు. నగర సంకీర్తన కూడా భజనయే. భజన సామూహికంగా ఒకచోట కూర్చుని, పరమేశ్వరుని నామాన్ని రాగతాళయుక్తంగా చేసేది. నగర సంకీర్తన, భగవంతుని నామాన్ని పాడుకుంటూ గంటసేపు వీధులలో తిరిగి స్వస్తానము చేరుకునేది. బ్రహ్మముహూర్తములో లేచి, భగవన్నామమును తాము తలంచి ఇతరులకూ శ్రవణము చేయించి, భగవన్నామముతోనే అందరిని నిద్ర మేల్కోల్పి, ప్రతి దినము వారి నిత్యకృత్యములను, ఆ నామ స్మరణతోనే చేయుటకు ప్రోత్సహించి, జీవితమును భగవదర్పితము గావించు పెద్ద సేవా కార్యము ఈ నగర సంకీర్తనము, భక్తులు ఒకచోట చేరి ప్రణవోపాసన చేసి, సుప్రభాతము చెప్పి తరువాత అరగంట లేక ముక్కాలు గంటసేపు మధురముగా భజన చేయుచు ఊరి వీధులలో వెళ్ళవలెను.

దివ్యభజన : జయ సాయీశంకర । నటన నటేశ్వర ।
సకల కళాప్రియ । జయపర్తీశ్వర । ॥జ॥
ప్రణవాకార । కుంతల సుందర ।
శ్రిత పరిపాలిత । కేశవ అంబర ॥ ॥జ॥

8) వేదాంతవేద్యుడు

ఈ పర్తీశ్వరుని వేదాంతాలు ఎట్లా కీర్తిస్తున్నాయి? కఠోపనిషత్తులో

మం॥ యదేవేహ తదముత్ర । యదముత్ర తదన్విహ ।
మృత్యోస్సమృత్యుమాప్నోతి । య ఇహనానేవ పశ్యతి ॥ (1-10)

మం॥ మనసైవేద మాప్తవ్యం । నేహనా స్తికించన
మృత్యో స్స మృత్యుం గచ్ఛతి । య ఇహనానేవ కించతి ॥ (4-11)

తా॥ ఏది యిచ్చట, యీ ప్రపంచమున కార్యకారణోపాధితో సంసారి వలె ప్రకాశించు చున్నదో అది (సాయిపరమేశ్వరుడు) తన లోపలనే ప్రకాశించుచున్నది. ఏది తన లోపలనో, అది యీ ప్రపంచమున ప్రకాశించుచున్నది. అచ్చట యీ ప్రపంచమున అనేకములుగా చూసెడివాడు. మరణము నుండి మరణమును పొందుచున్నాడు. మరల మరల జననమరణములను పొందుచున్నాడు. అంటే పరమేశ్వరుడు అక్కడా, ఇక్కడా, ఎక్కడా ఒక్కడే. అట్లు అనుభవించని వానికి సంసార భ్రమణము తప్పదు.

మం॥ అగ్నిర్యథైకో భువనం ప్రదిష్టో ।
రూపం రూపం ప్రతిరూపో బభూవ ।
ఏకస్తథా సర్వభూతాంతరాత్మ ।
రూపం రూపం ప్రతిరూపో బహిశ్చ ॥ (2-59)

తా॥ ప్రపంచమున ఒక అగ్నియే పలు రూపములుగా గనబడుచున్నాడు. ఒక్కటియే అగ్ని పలు కాష్టములలో ప్రవేశించి ఆయా కాష్టరూపముగ గానబడుచున్నది. ఆ విధముగనే సకల భూతములలోను నున్న, ఆత్మయును సాయిపరమేశ్వరుడే పలు రూపములుగా, ఆకారములవలె (ఘటాకాశము, మఠాకాశాము, మహాకాశము వలె) గానవచ్చుచున్నాడు.

**ఓం తత్సత్**